
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





# పెళ్ళి కానుక

*మహానగరం కథలు*

ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా. ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

"ఒక్కత్తే బిడ్డాయే, పెండ్లి దినం దగ్గరకొస్తున్నాది, ఎట్లా నిభాయించేది తెలవటంలే! " పొద్దుటినించీ పదోసారి అనుంటుంది సరోజ అదే మాట భర్త యాదగిరితో..

"గదేందే గట్లంటావు? దుడ్లు పోగు సేస్తానే ఉన్నారు కందా అన్నిదినాలసంది"అంది ముసలావిడ రుక్కవ్వ. సరోజకి చిరాకు పుట్టింది.

"ఏహే, నువ్వూకో అత్తమ్మా, దానిగురించి కాదు నేను మాతాడతంట"అని విసుక్కుని, 'పాడు కొంప.. పెద్దగా ఒక మాట అనుకోనీకి లేదు' అనుకుంది మనసులో..

భర్త యాదగిరి మాత్రం ఆమె చెప్పే విషయాలు విన్నాడో, లేదో తెలియనట్టుగా కూర్చుని ఉన్నాడు.

------------------

'ధారావి'...

ముంబై నగరంలోనే కాక ప్రపంచంలోనే అతి పెద్ద మురికివాడ(స్లం)ల్లో ఒకటి. ఎప్పుడో పంతొమ్మిదో శతాబ్దంలో బెస్తవారు మొదట అక్కడ వచ్చిచేరితే, కుండలు చేసుకునే కుంభారులు గుజరాత్ నించీ, తమిళులు తోలు పరిశ్రమలతో దక్షిణాదినించి, తర్వాత నూలు మిల్లులలో పనిచేయడానికి ఉత్తరప్రదేశ్ నించీ వచ్చిన వివిధ రకాల ప్రజలతో అతి పెద్ద స్లంస్ లో ఒకటిగా ఎదిగింది..

ధారావి లో రాజేంద్రప్రసాద్‌ఛాల్ ఒకటి. ఐదు అంతస్థులుగా కట్టబడిన ఆ భవనంలో దాదాపు ఇరవై ఐదు ఇళ్ళున్నాయి. మూడో అంతస్థులో మధ్యనున్న ఇంట్లో ఉంటారు యాదగరి అతని కుటుంబం, భార్య సరోజ, తల్లి రుక్కవ్వ, కూతురు సుప్రియ, కొడుకులు నరేందర్, రాజేందర్.

నిజామాబాద్ దగ్గరలో ఉన్న ఒక పల్లెటూరు యాదగిరిది. ఎప్పుడొచ్చారో తెలియదు కానీ ఎన్నేళ్ళనించో అక్కడే ఉంటున్నారు వాళ్ళు. అక్కడున్న అన్ని ఇళ్ళలాగానే వాళ్ళదీ రెండు గదుల ఇల్లు, ముందు ఒక డ్రాయింగ్ కం డైనింగ్ కం బెడ్ రూం, దానికి వెనకనున్న ఒక చిన్న వంటగది. మొత్తం తిప్పి కొడితే రెండువందల చదరపు అడుగులుంటుందేమో, దానిలోనే ఆరుగురు మనుషులు ఉంటారు. అన్ని ఇళ్ళని కలుపుతూ ముందువైపు పొడుగ్గా, సన్నని వరండా ఉంటుంది. భర్తలు పనులకీ, పిల్లలు స్కూళ్ళకీ వెళ్ళాకా, ఆడవాళ్ళందరూ అక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ మిగతా పనులు చేసుకుంటూ ఉంటారు. అన్ని ఇళ్ళకీ కలిపి కింద ఒక మూలగా కట్టిన టాయిలెట్లు. పొట్టచేత పట్టుకుని దేశం నలుమూలలనిచి వచ్చిన దిగువ మధ్యతరగతి వారి నిత్య జీవన బ్రతుకు చిత్రాలు ఈ ఛాల్స్ అనబడే గృహసముదాయాలు.

యాదగిరి బాంద్రాలో ఒక వ్యాపారవేత్త ఇంట్లో స్పేర్ డ్రైవర్ గా పనిచేస్తాడు. అంటే అతనికున్న పధ్నాలుగు కార్లని చూసుకుంటూ, అవసరం వచ్చినప్పుడు డ్రైవింగ్ చెయ్యాలన్నమాట. బస్ లోనో, అప్పుడప్పుడు లోకల్ ట్రైన్ లోనో వెళ్తాడు.

ధారావి లెదర్ వస్తువులకి చాలా పేరొందినది, బాగులు, సూట్ కేసులు, జాకెట్లు, గ్లవ్స్, పర్సులు ఇలా ఎన్నో లెదర్ వస్తువులు అక్కడ చేసి వివిధ దేశాలకి పంపుతారు. అలాంటి చిన్నా పెద్దా పరిశ్రమలు ధారావి నిండా ఉన్నాయి. అలాంటి ఒక పరిశ్రమ లో సరోజ పనిచేస్తుంది. వారానికి మూడు రోజులు అక్కడకి వెళ్ళి చిన్న చిన్న పనులు చేస్తుంది, మిగతా మూడు రోజులు ఇంటికి పని తెచ్చుకుని వస్తుంది, బాగ్‌లకి హాండిల్స్ కుట్టడం, లోపల వేసే లైనింగ్ క్లాత్‌లు తయారు చెయ్యడం ఇలాంటివి. పొద్దున్నే పనులన్నీ అయ్యాకా ఇరుగు పొరుగులతో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ చేసుకుంటుంది.

సుప్రియ పన్నెండు ఫెయిల్ అయ్యాకా చదువు మానేసింది. పదో ఏడు దాటినప్పటినించి తండ్రి వెంటేశేఠ్ గారింటికి వెళ్ళేది, వారింట్లో మొదట చిన్న చిన్న పనులతో ప్రారంభమైన ఆమె పని అమ్మగారికీ, అమ్మాయిగారికి కుడి భుజమయ్యేంతవరకూ వచ్చింది. ముఖ్యంగా వారి అమ్మాయి శీతల్‌కి సుప్రియ లేకపోతే క్షణం గడవదు. శేఠ్‌కి కూడా ఒక్కకూతురు, తర్వాత ఇద్దరు అబ్బాయిలు, కవల

పిల్లలు, శీతల్ తర్వాత చాలా సంవత్సరాలకి పుట్టినందువల్ల వారిద్దరికి అమితమైన గారం, ఒక్కర్తే కూతురు కావడాన శీతల్ ఆడింది ఆ-ట, పాడింది పాట.

ఆ పదిహేను గదుల బంగ్లాలో ఒక అంతస్థు అంతా శీతల్‌కే. ఆ పిల్ల ఆడుకోవడానికి ఒక గది, చదువుకోవడానికి ఒక గది, పడుకోవడానికి ఒక గది, బెడ్‌రూములోకి అనుబంధంగా ఉన్న బాత్ రూములోంచి ఆమె బట్టలు కట్టుకోవడానికీ, తయారు కావడానికీ మరొక గది ఇలా ఆ అంతస్థు ఆమెకే. ఆ నాలుగు గదులూ ఏ.సీతో చల్లగా హాయిగా ఉంటాయి.

శేఠ్ మంచివాడే, అమ్మగారు మీరా మాత్రం చాలా గట్టిది. ఐదు రూపాయలిచ్చి యాభై రూపాయల పనిచేయించుకోగల దిట్ట. అమ్మాయిగారి పని మొత్తం సుప్రియ చూసుకుంటుంది, కవల పిల్లలని చూసుకోవడానికి వేరే మనిషి, వంటకి ఒకతను, ఇద్దరు డ్రైవర్లు, తోటమాలి ఉన్నారు. అప్పుడప్పుడు అమ్మాయిగారడిగితే అక్కడే బంగ్లాలోనే పడుకుంటుంది, శీతల్ ఎంత చెప్పినా సరే ఏ.సీ రూములో మాత్రం పడుకోనిచ్చేది కాదు మీరా. పనివాళ్ళని పనివాళ్ళలాగే ఉంచాలనేది ఆమె ఉద్దేశ్యం. సుప్రియకి శీతల్ గదన్నా, ఆ గదిలోని అలంకరణన్నా చాలా ఇష్టం. సముద్ర తీరం కావడాన ఎప్పుడూ ఉక్కపోతగా ఉండే బొంబాయిలో ఆమె గదిలో ఉన్న ఏ.సీ ఇచ్చే చల్లదనమంటే మరీ ఇష్టం. ఎప్పుడైనా ఒక్క రాత్రయినా ఆ గదిలో పడుకోవలనేది ఆమె కోరిక. కానీ శీతల్ ప్రియని తన గదిలో కూర్చోబెట్టుకుని ఎక్కువ సేపు కబుర్లు చెప్తేనే మీరా కోప్పడుతుంది. చలువరాయితో అద్దంలా మెరిసిపోయే గదీ, బాత్రూమూ సుప్రియకెంతో ఇష్టం, కానీ వాటిని శుభ్రంగా ఉంచడమే తన పని, అనుభవించి ఆనందించే అవకాశం లేదు.

సుప్రియ చూడటానికి చక్కగా ఉంటుంది, నల్లని ఒత్తయిన జుట్టూ, చక్కటి నున్నని, మెరిసే చర్మం,విశాలమైన కళ్ళు, అందమైన తీరు. ఆ పిల్ల పదో క్లాస్ లో ఉండగా ధారావి లోనే ఉండే భరతన్ అనే ఒక తమిళ పిల్లాడు ఆమెని ఇష్టపడ్డాడు. అప్పటికా పిల్లాడు ఐ.టి.ఐ పూర్తి చేసి ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. చూడటానికి బాగుంటాడు. వాళ్ళది సుప్రియ వాళ్ళ ఇంటివెనకవైపు రెండు మూడు లైన్ల తర్వాత ఉన్న అపార్ట్‌మెంటు. ఎనిమిదివందల చదరపు అడుగులతో పాలరాయి గచ్చు, ఇంట్లోనే టాయ్‌లెట్ ఉన్న ఇల్లు. ధర ఎక్కువే, అద్దే ఎక్కువే. సొంత ఇల్లు కావడంతో వాళ్ళు చాలా స్థితిమంతులకిందే లెక్క. కానైతే భరత్ తల్లి రాజీ మామీ చాలా గయ్యాళి, అందువల్ల ఆమె అంటే అందరూ భయపడతారు. పైగా తమకంటే తక్కువ స్థాయిలో ఉన్నవారిని ఆమె చాలా హీనంగా చూస్తుంది.

స్కూల్ యూనిఫాం వేసుకుని పొందికగా నడుచుకుంటూ వెళ్ళే సుప్రియని చూసి భరత్ మొదటిసారి మనసు పడ్డాడు. తర్వాత గణపతి సంబరాలలోనూ, నవరాత్రికి జరిగే దాండియా వేడుకలలోనూ కలివిడిగా, సరదాగా తిరిగేప్రియని చూసిఅదింకా పెరిగింది.. దాండియా వేడుకల్లోనే కలిసి డాన్స్ చేస్తున్నట్టుగా చేస్తూనే తన మనసులోని మాట బయటపెట్టాడు. చూడటానికి బావుంటాడు, ఉద్యోగం చేస్తున్నాడు, పదోతరగతిలో ఉన్న పిల్లకి అభ్యంతరం చెప్పడానికేమీ కనబడలేదు.. వెంటనే సరే అంది. దాదాపు మూడేళ్ళుగా వాళ్ళ ప్రేమాయణం నడుస్తోంది. వాళ్ళ అమ్మకి భయపడి కొన్నాళ్ళు ఇంట్లో చెప్పకుండా ఆగాడు భరత్. కానీ చిన్నబస్తీలలో విషయాలు దాగడం కష్టం, ఆ నోటా ఈ నోటా అది రెండు కుటుంబాలనీ చేరనే చేరింది.

ఆ రోజు రాజీ మామీ చేసిన గొడవ అంతా, ఇంతా కాదు. పాలరాతి ఇల్లనీ, స్థితిమంతులనీచూసి పిల్లని ఎరవేసారని, ఎర్రగా బుర్రగా ఉంది కదా అందుకే తేలికగా పడతాడనుకున్నారనీ ఇలా చాలా అంది.

యాదగిరికీ, సరోజకీ కూడా వారితో సంబంధం కలుపుకోవడం ఇష్టం లేదు, సరోజ అన్నకొడుక్కి ఇచ్చి చెయ్యాలని వాళ్ళ ఆలోచన. యాదగిరి అయితే అస్సలొప్పుకోలేదు. " ఆళ్ళెవరో, మనమెవరో, గిది అయ్యే కత కాదు " అని గొడవ పెట్టాడు.

సరోజ కూడా ముందు బాధపడినా తర్వాత సమాధానపడింది. " ఎక్కడెక్కడివాళ్ళమో రెక్కల్ని నమ్ముకుని ఇక్కడ ఒక చూరుకింద ఉంటన్నాము కదా, ఎన్నో ఏళ్ళుగా ఇక్కడున్నాళ్ళే మనకు బందుగులూ, స్నేహితులూ అయినప్పుడు సంబంధీకులెందుకు కాకూడదు? " అని ఆలోచించడం మొదలు పెట్టగానే ఆమెకి ఇదొక సమస్యగా అనిపించలేదు. అంతేకాదు, " పెళ్ళి అయిన తర్వాత

తన కూతురు తమలా ఇలా ఇరుకులో ఉండక్కర్లేదు, చక్కగా పాలరాయి పరిచి, సొంత టాయిలెట్ ఉన్న ఇంట్లో దర్జాగా ఉండవచ్చు " అనుకుంటేనే ఆమెకెంతో సంతోషంగా ఉంది.

ఇక్కడ వంటింట్లోనే వంట చేసి పాత్రలన్నీ ముందు గదిలోకి తెచ్చి పెట్టాకా ఒకరి తర్వాత ఒకరు ముగ్గురాడవాళ్ళు అక్కడే స్నానాలు చేస్తారు, మగవాళ్ళు ప్రతీ అంతస్థులోనూ ఉన్న కామన్ టాయిలెట్లు వాడతారు. అందరి స్నానాలూ అయ్యాకా అందరూ కింద ఒకచోట చేరి బట్టలుతుక్కుంటారు వాటిని తెచ్చి ఇంటి ముందు వరసలుగా కట్టిన తాళ్ళమీద ఆ రేస్తారు.

కానీ సుప్రియ భరత్‌ని తప్ప మరెవ్వరిని చేసుకోనని తెగేసి చెప్పేసింది, అందుకే దిగి రాక తప్పలేదు. ఆ పిల్ల తత్వమే అంత, ఎంత నెమ్మదిగా కనిపిస్తుందో అంత మొండిది.

రాజీ మామీ కోరికలకి అంతులేకుండా ఉంది. అందుకే సరోజకి భయంగా ఉంది ఉంది. కట్నం, బైకు కాక, సోఫా, బంగారం గొలుసు, టైటన్ వాచీ, నాలుగు జతల బట్టలు పెళ్ళి కొడుకుకీ, తామందరికీ బట్టలు, వాళ్ళ కూతురికో బంగారపు గొలుసు, ఇవన్నీ అడిగింది. పెళ్ళి వాళ్ళ ఇంటిపక్కనున్న ఫాక్టరీ హాల్లో ఆర్భాటంగా చెయ్యాలని చెప్పింది. ఇంకా చిన్నా, చితకా కోరికలెన్నో. యాదగిరి పైకేమీ చెప్పడు కానీ సరోజ అలాక్కాదు. మనవాళ్ళు కాకపోయినా మంచి సంబంధం, భరత్ కూడా 'పెళ్ళివరకూ అమ్మ ఏదంటే అది చెయ్యండి, తర్వాత నేను చూసుకుంటాను' అని ధైర్యం చెప్పాడు. అయినా ఆమెకి కంగారుగానే ఉంది.

దానికి తోడు శీతల్ పెళ్ళి కూడ అప్పుడే కుదిరింది, అమ్మాయి నిశ్చితార్థానికి అడ్డువస్తుందని సుప్రియ పెళ్ళి పదిహేనురోజులు వెనుక పెట్టుకోమన్నాడు శేఠ్. అలాగే ముహూర్తం చూశారు. పదిహేనురోజుల ముందునించీ మొదలయ్యాయి శేఠ్ ఇంట్లో వేడుకలు. రోజుకోక ఫైవ్‌స్టార్ హోటల్లో పార్టీలు. ఇంటికి వచ్చి చీరలూ, గాగ్రాలు, లెహెంగాలూ అవీ చూపించే డిజనర్లూ, ఎంపిక చేసుకున్నవాటికి సరిగ్గా సరిపోయేలా నగలు చేయడానికి వారితోనే వచ్చే వజ్రాల వర్తకులూ, రకరకాల సౌందర్య సాధనాలతో వెనకే తిరిగే బ్యూటీషియన్లూ. వంటవారూ, ఇల్లంతా రోజుకోరకంగా అలంకరించే వాళ్ళూ ఇలా ఎంత హడావిడో చెప్పనలవి కాదు. అసలు వేడుకకి ముందు వారం రోజుల పాటు రోజుకో రకమైన తరహాలో పార్టీలు ఇచ్చి, ప్రధానానికి ముఖ్యమైన వారిని బాలీద్వీపానికి తీసుకువెళ్ళి అక్కడ నిశ్చితార్థం చెయ్యాలని ప్లాన్.

వారింటి వేడుకల మాట ఎలా ఉన్నా, సుప్రియకీ, యాదగిరికీ ఒక్క క్షణం తీరిక ఉండటం లేదు. దాంతో సరోజకి విసుగ్గా ఉంది. "ఆరింట పంక్షన్ సూసుకుంటా మన ఇంట పెండ్లి మాట మరిసిపోనారు అబ్బాకూతుళ్ళిద్దరూ, ఇట్లే తిరిగినావంటే పెండ్లి దినానికి కాకి లెక్క తయారవుతావు" అని గోల చేసేది.

" ఏందమ్మా నీ లొల్లి? శీతలమ్మ ఎంగేజ్మెంట్ కదా! " అనేది సుప్రియ.

"మేము బాలీకి ప్రయాణం కాగానే నువ్వు సెలవు తీసుకో నీకూతురు పెళ్ళికి, వారంలో వచ్చేస్తాము, అప్పటికి వచ్చేద్దువుగాని "అంది మీరా చాలా ఉదారంగా.

ఆ వేడుక గురించి రోజుకోక విశేషం వర్ణించి చెప్పేది సుప్రియ. అవి వింటూ ఉంటే సరోజ తల్లి మనసు బాధతో నిట్టూర్చేది. "కావలసినంత డబ్బుంటే కొండమీద కోతిని తెచ్చుకోవచ్చు కదా, ప్రతీ కానీకి సూసుకుంటా బిడ్డ పెండ్లి సేసే పరేషానుండదు" అని రోజుకొకసారైనా అనుకునేది. " నాకే ఇట్లుంటే పాపం నా బిడ్డకెట్లుంటదో? "అనుకునేది.

యాదగిరేమీ పట్టించుకోడు, పిల్ల ముందు అని బాధపెట్టడమెందుకని తనలో తనే బాధపడసాగింది. "ఇగనో, ఇప్పుడో మరుదులిద్దరూ, ఆడబిడ్డా వస్తారు. ఇగ ఏం చేసినా ఈ రెండు గదుల్లోనే. మంగళస్నానాలైనా సరే, మంగళాతరులైనా సరే " అనుకుంది నిరాశగా.

---------------

అలా అనుకుంటూ ఉంటే వద్దన్నా సరోజకి గతం కళ్ళముందు తిరిగింది. తన పెళ్ళప్పుడు బొంబాయిలో కాపురం అంటే ఎగిరి గంతేసింది. అమ్మా, నాయనలకి పెద్దగా తెలియదు, పెళ్ళి అయి యాదగిరితో మొదటిసారి ఇక్కడికొచ్చినప్పుడామెకి కళ్ళనీళ్ళపర్యంతం అయింది, ఆ ఇల్లు, ఆ వాతావరణమూ చూసి. ఆమె తల్లితండ్రులూ పేదవారే, కానీ పల్లెటూళ్ళో వాళ్ళదంటూ ఒక చిన్న ఇల్లూ, వెనక తోటా ఉండేవి. అలా పెరిగిన ఆమెకి ధారావి లాంటి వాతావరణం చూస్తే తట్టుకోవడం కష్టమే అయింది. ఆ సన్నని ఇరుకు సందులూ, రోడ్డేవో డ్రైనేజీలేవో తెలియకుండా పారే మురికి నీరు, ఎక్కడపడితే అక్కడ పడేసిన చెత్తా, చెదారం, విపరీతంగా వర్షాలు పడే వర్షాకాలంలో ఎక్కడ కూర్చోవాలో కూడా తెలియనంతగా ఇల్లంతావచ్చే నీరు, కుండలు చేసే వారి ప్రదేశాన్నించి వచ్చే పొగా, తోళ్ళ వాసనలూ. ఆమెకి చాలా చిరాగ్గా ఉండేది.

" ఈడుండుడు నా వల్ల కాదు ' అని ఒక రాత్రి వెక్కి వెక్కి ఏడిచింది. అత్తా, మావా, మరుదిలిద్దరూ ఒక ఆడబిడ్డా ఉండేవారు, అలాంటి ఇంట్లో సరసాలు, సరదాలు మాట అటుంచితే ఏకాంతంలో మాట్లాడుకునే అవకాశమూ గగనమే. అందరి భోజనాలు అయ్యాకా, గిన్నెలు తోముకుని బోర్లించి వంటగది తడి లేకుండా తుడుచుకుని అప్పుడు అక్కడ వేసేది పరుపుని. కొత్త దంపతులకి దక్కిన అర్హత అది. రాత్రి పదకొండుకి పడుకుంటే పొద్దున్నే ఐదు గంటలకే లేవాలి, చా తాగి మావ డ్యూటీకి పోవాలి గదా. ఈ లోపున ఎవరికైనా దాహం వేస్తే మంచినీళ్ళకో, కడుపు నొప్పో, పన్ను నొప్పో వస్తే జీలకర్రకో, లవంగానికో తలుపుకొట్టేవారు. అందరికంటే చిన్నవాడు భిక్షపతికి వదిన దగ్గరే ఎక్కువ చేరిక, అందుకని అప్పుడప్పుడు వాడు పరుపు మీద వదిన దగ్గర పడుకుంటానని గొడవ చేసేవాడు.

ఎక్కడకి వెళ్ళాలన్నా కష్టమే. అక్కడ ఇమడలేక, వదిలేసి తమ ఇంటికి వెళ్ళలేక దాదాపు ఆ రునెలలు నరకాన్ని అనుభవించిందామె. అలాంటి అశుభ్రవాతావరణంలో ఉండడం దుర్భరంగా ఉండేది ఆమెకి. యాదగిరి మంచివాడు కావడం వల్ల, అత్తా, మావలతో పెద్ద గొడవలేమీ లేకపోవడం వల్లా మెల్లిగా అలవాటు పడటానికి ప్రయత్నించింది, సుప్రియ పుట్టాకా పూర్తిగా సర్దుకుంది, అప్పటికి ఆ డపడుచు పెళ్ళి అయింది, పెద్ద మరిదికి ఉద్యోగం వచ్చింది, ఇంట్లో ఆర్థికస్థితి కాస్త మెరుగయింది. మగపిల్లలు పుట్టేసరికి ఇద్దరు మరుదులూ కూడా వేరే వేరే చోట్ల ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

గతంలోకి జారిన ఆమెని వాస్తవానికి రప్పిస్తున్నట్టుగా గట్టిగా పిలిచాడు యాదగిరి.

-----------------------------------

"ఓ సరోజమ్మా, ఎవులొచ్చరో సూడు " అంటూ..

ఎక్కువ ఆనందం వచ్చినా, ప్రేమగా పిలవాలన్నా "ఓ సరోజమ్మా" అంటాడు యాదగిరి. "ఎవరా " అనుకుంటూ వచ్చిన ఆమె యాదగిరితో ఉన్న అతన్ని చూసి,

"ఎవరూ నర్సిమ్మన్నే? ఓ యబ్బో, ఎన్నేళ్ళయిందన్నా, నిన్ను సూసి, ఎట్లున్నావు? ఏడున్నావు? ఏంది కత? వొదినెట్లాగున్నది? " అంటూ గబగబా ప్రశ్నలు వేసింది సరోజ

" కూసింత సాపెట్టవే ముందుగాల " అన్నాడు యాదగిరి నవ్వుతూ,

" గట్లనే " అని స్టవ్ మీద నీళ్ళు పెట్టి మళ్ళీ వచ్చి వాళ్ళిద్దరి దగ్గర కూర్చుంది.

"బాగానే ఉన్నా బిడ్డా, నువ్వెట్లుండావు? మా బావ నిన్ను మంచిగ సూసుకొంటుండా లేదా?, పిల్లలు మంచిగున్నారా? ప్రియమ్మ పెండ్లంటగా, అప్పుడే ఎంత పెద్దగయింది " అన్నాడు నరసింహ నవ్వుతూ.

వాళ్ళు దాదాపు పదేళ్ళక్రితంవరకూ ఇదే భవనంలో రెండో అంతస్థులో ఉండేవారు, నరసింహ, భార్య సంతోష, కూతురు మల్లిక.

" అందరూ సౌదీ పోతన్నారు, మనమూ పోదామని" నరసింహ యాదగిరితో అన్నప్పుడు "వద్దులే బావా, ఈడ మంచిగనే ఉన్నది గదా "అని ఊరుకున్నాడు యాదగిరి .

త్వరగా నిర్ణయాలు తీసుకునే నరసింహ మాత్రం పెళ్ళాం, బిడ్డల్నిఊరిలో వదిలి ఒక్కడే వెళ్ళాడు సౌదీకి.

మొదట్లో అప్పుడొకటీ, ఇప్పుడొకటీ ఉత్తరాలు రాసినా తర్వాత తగ్గిపోయింది. దాదాపు పదేళ్ళ తర్వాత ఇదే చూడటం. మనిషి కొంచం నీరసంగా, వయసు పైబడినట్టుగా కనిపిస్తున్నాడు.

"మీ వొదినె మనకిక లేదమ్మా? "అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు, " మల్లికమ్మకి పెండ్లి జేసినా, మంచిగనే ఉన్నది అక్కడనే.. మా బావమరిదే "అన్నాడు.

సరోజ కూడా కన్నీరు పెట్టుకుంది. సంతోషమ్మని తలుచుకుని. ఒకే ప్రాణంగా ఉండేవారిద్దరూ. వచ్చిన కొత్తలో ఇక్కడ ఇమడలేక బాధపడినప్పుడు సంతోష ఎంతో ఆసరాగా ఉండేది. అన్నింటికీ తోడుగా తీసుకెళ్ళి నేర్పించేది. తనని సొంత చెల్లెల్లా చూసేవాడు నరసింహ, అందుకే ఎప్పుడూ బిడ్డా అనే పలకరిస్తాడు.

" మీ వొదినె తీరిపోయినంక ఆ ఊరిలో ఉండలేక మళ్ళొచ్చేశినాను బిడ్డా. ఒక ఏజెన్సీ లో సెక్యూరిటీ గార్డ్‌గా కొలువైంది. బ్యాంక్ ఏ.టీ.ఎం దగ్గర కూసొనుడు, కాపలా కాయుడు.. గంతే పేషీ " మెషీనింకా రెడీకాలే, గది కట్టి, అద్దాల తలుపులూ అవి పెట్టిండ్రు. ఇగనో రేపో ఏ.సీ పెట్టుడు బాకీ, ఏందో మనుషులకున్నా లేకున్నా, మిషన్లకన్నీ కావాలే" అని నవ్వాడు, చాయ్ తాగుతూ.

"అన్నా రేతికుండిపోరాదే? " అంది సరోజ.

"మళ్ళొస్తా బిడ్డా "అన్నాడు తను తెచ్చిన మిఠాయి, పూలు ఆమె చేతిలో పెడుతూ.

" నాకీ మోతీచూరు లడ్డూ ఇష్టమని నీకింకా యాదుకున్నదిలే అన్నా " అంది సంతోషంతో. " వొదినే ఉంటే ఎంత మంచిగుండేదో " అని మళ్ళీ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

తర్వాత నాలుగురోజులకి రాజీ మామీ ఇంట్లోనే సుప్రియ, భరతన్ ల నిశ్చితార్థం జరిగింది. మరో నాలుగురోజుల్లో పెళ్ళి.

" దేవుని దయవల్ల ఎంగేజ్మెంట్ సక్కగయింది, ఇట్టాగే పెండ్లి కూడా అయిపోతే దాదర్ దేవుని దగ్గరకొస్తానని మొక్కినా "అంది సరోజ. దాదర్ దేవుడంటే ముంబాయి మహానగరంలో అతి ప్రముఖుడిగా పూజలందుకునే సిద్ధివినాయకుడు. చిన్నా, పెద్దా, బీదా, గొప్పా తేడాలేకుండా పూజిస్తారు, తమ తమ ఇళ్ళనించీ నడిచి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

పెళ్ళి రెండు రోజుల్లోకి వచ్చింది అనగా అప్పుడు సరోజ మెల్లగా అడిగింది యాదగిరిని.

" పెళ్ళి సరే, తర్వాత ముచ్చట్లు కూడా సూడొద్దా "అని

అర్థం కానట్టు చూశాడు అతను.

" ఏహే, అన్ని ఇడమరిసి సెప్పాలి "అని మెల్లిగా చెవిలో చెప్పింది, లేకపోతే పక్కనే చదువుకుంటున్న మగపిల్లలు వింటారని.

"ఓ అదా, మన ఇల్లేడకి పోయింది? అది సాలదా, అంతగ్గాకుంటే మనమా రెండు దినాలు పక్కింటికో, మా తమ్ముడింటికో పోదాం "అన్నాడు తేలిగ్గా.

"అది కాదయ్యా, ఓ ముద్దూ మురిపెమూ లేక మన బతుకెట్టాగూ ఈడే తెల్లారినాయి. కనీసం బిడ్డకైనా జరంత మంచిగా నడిపిస్తే సక్కగుంటది కదా, పైగా దాని అత్త ఒప్పుద్దా అదీ కాక ఈ ఇరుకింట్లో మనం పడ్డ పాట్లు సాలవా? సిన్నప్పటినించీ ప్రియమ్మకి ఏ.సీ రూమంటే ఎంత ఇష్టమో తెల్సుగదా బిడ్డకెక్కడన్నా ఏ.సీ రూము సూడు, బిడ్డకీ ఆసుంటది గదా, " అంది.

యాదగిరికి కాళ్ళూ చేతులూ ఆడలేదు. "ఇప్పటికిప్పుడు ఏ.సీ గది అంటే ఏడికెల్లి దొరుకుద్ది? ఎంత డబ్బు కరుసవుద్దో ఏటో" అని లోపలే మధనపడసాగాడు.

మర్నాడు నర్సింహని కలిసినప్పుడు అదే మాట చెప్పాడు. అతని దగ్గరా ఎక్కువ డబ్బు లేదు హోటల్‌లో గది అద్దెకు తీసుకునేందుకు. "ఊకోరా, ఏదో సేద్దాములే "అన్నాడు అతనిని సముదాయించడానికి.

ప్రతీ చిన్న విషయమూ లెక్క వేసుకుని అన్నింటికీ సరిపడా డబ్బు దగ్గర పెట్టుకున్నాడు, అప్పు లేకుండా పెళ్ళి చెయ్యాలని అతని ప్రయత్నం. అన్నీ సవ్యంగా అవుతున్నాయని అనుకుంటూ ఉంటే ఇదేదో పులిమీద పుట్రలావచ్చింది అతని ప్రాణానికి. తండ్రిగా ఆ మెకి అన్నీ చక్కగా అవ్వాలనే అతని ఆ శానూ, కానీ పరిస్థితులు కూడా సహకరించాలి కదా, "ఇప్పుడెట్లా గావాల" అనుకోసాగాడు.

-------------

"నిన్నటినించీ సోచాయిస్తంటే ఒకటే చారా కానస్తున్నది" అన్నాడు నరసింహ నాలుగు రోజుల తర్వాత యాదగిరితో.

" ఏంది బావా అది? అన్నాడు యాదగిరి ఆత్రంగా"

" నీకెందుకు ? నే సెప్తాగా, ముంగట పెండ్లి కానియ్యి "అన్నాడు ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా. ఇద్దరూ అతను కాపలా కాసే ఏ.టీ.ఎం గది ముందు కూర్చుని ఉన్నారు.

పెళ్ళి చక్కగాఅయింది. "మా నర్సిమ్మామ" అని సంబరంగా పరిచయం చేసింది సుప్రియ భర్తకి.

"నూరేల్లూ సల్లగుండండి బిడ్డా" అని మనసారా దీవించాడు, ఇద్దరినీ కౌగలించుకుని.

"మీ అత్తే ఉంటేనా "అని బాధపడ్డాడు. పచ్చని పట్టుచీరలో మల్లెమొగ్గలా అందంగా ఉంది సుప్రియ. "సాయంత్రమొస్తా, పిల్లల్ని రెడీగుంచు" అన్నాడు యాదగిరితో.

ఆటోతో వచ్చాడు చీకటి పడ్డాకా.

"సరోజమ్మా, నువ్వుభీ రా బిడ్డా" అన్నాడు. రాజీ మామీ తను రాకూడదు, రానంది. అక్కడికి అదీ అదృష్టమే అనుకున్నాడు నర్సింహ.

దాదాపు మూడు కిలోమీటర్లు ప్రయాణించాక ఆటో సరిగ్గా నరసింహ పనికి కుదిరిన ఏ.టీ.ఎం దగ్గర ఆగింది. అప్పటికి తొమ్మిదయింది. మెయిన్ రోడ్‌కి కొద్దిగా పక్కకి ఉన్న రోడ్‌లో ఉంది ఆ ఏ.టీ.ఎం దాని వెనక ఎప్పుడో మూసేసిన బట్టల మిల్లులున్నాయి. ఎదురుగా ఒక చిన్న పార్క్‌లాంటిది ఉంది. జనసంచారం తక్కువ

ఏ.టీ.ఎం గది దాదాపు వంద చదరపు అడుగులుంటుందేమో, కొత్తగా వేసిన పెయింటు వాసన దూరానికే వస్తోంది, లోపల మిషన్ పెట్టారు కానీ డబ్బు ఇంకా లోడ్ చెయ్యలేదు. రెండు మూడు రోజుల క్రితమే ఏ.సీ బిగించారు, మరో రెండురోజుల్లో సీ.సీ.టీ.వీ కెమెరా బిగించవలసి ఉంది. లోపల ఏం జరుగుతోందో తెలియని విధంగా గ్లాస్‌కి ఫిల్మ్ వేసి ఉంది.

చిన్న చిరునవ్వుతో " రా బేటా, రావయ్యా అల్లుడా, ఇగ సూడండి రేపుదయం వరకూ ఈ ఏ.సీ గది మీది" అన్నాడు.

లోపల పరుపువేసి ఉంది, దాని మీద తెల్లటి దుప్పటీ, రెండు మెత్తటి దిండ్లూ, పక్కనే వెలుగుతున్న అగరొత్తులూ, దుప్పటి మీద పరిచిన మల్లెలూ, ఇలా ఎంతో ప్రేమతోనూ, హృదయం నిండా నిండిన మమకారంతోనూ ఒక చిత్రకారుడువేసిన సున్నితమైన చిత్రంలా ఉంది లోపల దృశ్యం.

" ఇగో, ప్రియమ్మా, చౌపాటీ కుల్ఫీ నీకెంతిష్టమో నాకెరికేలే, అని రెండు మట్కా కుల్ఫీలు పెట్టాడు, అది అయినాకా పాన్‌లు.. ఇగ పోరి, బయట తాళమేసుకుని అగో కూసింత దూరంలో మీకు కనబడకుండా గా షాప్ మెట్లమీద పండుతా. సరోజమ్మా, బిడ్డని లోనికి పంపు, అంతా మంచిగుండాల " అన్నాడు.

" గిదేంది బావా? " అని యాదగిరి ఏదో అడగబోతుంటే చటుకున్న అతని నోరు మూసి

" నేను సేసేది తప్పని నాకెరికే, బేంకోళ్ళనీ, సర్కారోళ్ళనీ మోసం జేయకూడదు. నాతానా డబ్బులేదు, నీ తానా లేదు. దుడ్లు లేనోడు దేనికీ కొరగాడు. శేర్ కూతురెంబట తిరిగేది ప్రియమ్మ, ఒక్కదినం బోట్ హౌస్ లోనైనా సోటియ్యదు  ఆయమ్మ. తన కూతురి పెండ్లి మాత్రం దేవుని పెళ్ళి తీరున సేస్తది, అదీ యాపారంలో మందిని మోసంసేస్తే వచ్చిన డబ్బుతో. ఏడున్నది నాయం? ఉన్నోళ్ళకీ లేనోళ్ళకీ ఆ సలొక్కటే తీరే దారులే వేరు, కాదు. మనసుంటోల్లకి దారులే లేవు సరేలే ఇగ అవన్నీ పోనీ.

" సెల్లెమ్మా అని పిలిసినా సరోజమ్మ నా బిడ్డలెక్క, ఇగ ప్రియమ్మయితే నా బిడ్డనే, ఈ సేతుల మీద గాదా ఎత్తి పెంచినది. ఏం చెయ్యాల? ఎట్లా గావాల? అంటా ఖరాబు సేసుకుంటున్నప్పుడొచ్చినాది ఈ ఆలోసన. సూద్దం ఏటవుద్దో? మెసీన్ లో దుడ్డులేదు గదా, అంతవరకూ మేలే. ఇన్సపెక్టర్ వస్తే సూసుకుందాం. మనకెరికున్నాడే, ఎట్లా జెయ్యాలో ఎరికేలే, నువ్వూ సెల్లెమ్మా సుకంగా ఇంటికిపోండి ఆటోలో " అన్నాడు.

ఏం మాట్లాడాలో తెలియనట్టు నిలబడి పోయారు యాదగిరి, సరోజమ్మా.

*కథ వెనక కథ...*

*ఎప్పుడో దాదాపు ఆరునెలల్కితం అనుకుంటా, ఇలాంటిదే ఒక సంఘటన జరిగిందని  పేపర్లో వచ్చింది,  ఏ.టీ.ఎం వాచ్ మేన్ తన కూతురి కోసం కథలోని నర్సింహ పాత్రలాగే ప్రవర్తిస్తే పోలీసులు గమనించి, అతన్ని పట్టుకున్నారని రాశారు. తర్వాత ఏమయిందో నాకు తెలీదు. ఇందులో తప్పొప్పుల ప్రసక్తి పక్కన పెడితే, ఒక తండ్రి లేదా తల్లిపరంగా చూస్తే ఎన్నో నిష్టూరమైన నిజాలు కళ్ళముందు కదులుతాయి. ఆర్ధిక పరమైన అసమానతలు, తద్వారా ఎదురయ్యె అసమర్ధతలుగా అనిపించే అసహాయతలూ, ఇలా ఎన్నో నిత్య జీవిత సత్యాలు. ముంబయి మహానగరంలో ఈ అసమానతలు మరీ ప్రస్ఫుటంగా అనిపిస్తాయి, ముఖ్యంగా మురికివాడలుగా (స్లంస్)గా పిలవబడే ఆ నివాసాలని చూస్తే.  ఆ సంఘటననీ, ఈ ప్రదేశాలని కలుపుతూ రాసిన కథ ఇది.*

●●●

Click here to share your comments on this story